సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మండల కేంద్రంలో చిన్నారికి అంబలిని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఏప్రిల్ 8 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అంబలిని అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, లయన్స్ క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సీతారాంరెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల గౌరవాధ్యక్షుడు గంప శ్రీను, నాయకులు భరత్, కుమార్, శ్రీను, పాండు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన

వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 8 : ఫరూఖ్‌నగర్ మండలంలోని కొండన్నగూడ, మెళ్లగూడ, వెంకన్నగూడ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ సోమవారం వరి పంటను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగులను గమనించి రైతులకు సూచనలు చేశారు. సాగులో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. పంట మార్పిడితో భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రమణ, నిఖిల్‌రెడ్డి, నాయకులు వేణు, రైతులు పాల్గొన్నారు.

12న బసవేశ్వర విగ్రహావిష్కరణ

ఆహ్వాన కరపత్రాన్ని అందజేస్తున్న మంచాల లింగాయత్ సభ్యులు

మంచాల, ఏప్రిల్ 8 : వీరశైవలింగాయత్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచాల గ్రామంలోని చెరువుకట్టపై ఏర్పాటు చేసిన మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు వీరశైవలింగాయత్ కేంద్ర కమిటీ సభ్యుడు శెట్టి శివకుమార్ తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని భద్రకాళి, వీరభద్రస్వామి ఆలయంలో లింగాయత్ కుటుంబ సభ్యులకు వీరశైవ లింగాయత్ మంచాల మండల అధ్యక్షుడు శేఖరనప్ప ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాయిని ఆనందప్ప, పట్నం శెట్టి విశ్వనాథ్, జక్క హరీశ్, జక్క పరమేశ్, జక్క భూషణ్, కర్రె ప్రభు, నందు, శివ, సోమప్ప పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- తిమ్మారెడ్డిగూడ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, పక్కన గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ తదితరులు

షాబాద్, ఏప్రిల్ 8: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం షాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ప్రముఖ న్యాయవాది, మాజీ సర్పంచ్ బేగరి ఆంజనేయులు అధ్యక్షతన నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కిందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో 1003 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యనందించినట్లు తెలిపారు. దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహనీయుల జాబితాలో ముందుండే గొప్ప నేత అంబేద్కర్ అని చెప్పారు. ఆయన ఆలోచనలు, ఆదర్శాలు నేటి తరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతో నేడు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని, బాగా చదువుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ దళితసేన అధ్యక్షుడు జేబీ రాజ్, విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షుడు మాస్టార్‌జీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, ఎంపీటీసీ గుత్తి సునీత, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, మద్దూరి శకుంతల, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగులు నీరటి రాంచంద్రయ్య, యాదయ్య, ఉపాధ్యాయులు దోస్వాడ నర్సింహులు, ఆశీర్వాదం, వివిధ పార్టీల నాయకులు సున్నపు వసంతం, వీరేందర్‌రెడ్డి, రామస్వామి, చెన్నయ్య, సత్తయ్య, మణెయ్య, మహిపాల్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

మొయినాబాద్, ఏప్రిల్ 8: వరిలో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ తెలిపారు. సోమవారం మొయినాబాద్ రైతు వేదికలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వరిలో కాండం కుళ్లు తెగులు, అగ్గితెగులు, కాండం తొలుచు పురుగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. కాండం కుళ్లు తెగులు నివారణకు ఒక లీటర్ నీటికి ప్రొపికోనజోల్ 1 మిల్లిలీటర్ లేదా హెక్సాకోనజోల్ 2 మిల్లిలీటర్ల చొప్పున మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 మిల్లి లీటర్లు లేదా ఐసోప్రొథైయోలిన్ 1.5 మిల్లి లీటర్లు లేదా కాసుగొమైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరా3జీ గుళికలను ఎకరానికి 10 కిలోల చొప్పున వేసుకోవాలని చెప్పారు. వరి పొట్ట దశలో లీటరు నీటికి క్లోరాంట్రనిలిప్రోల్0.3 మిల్లి లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని అన్నారు. వరి చేను గట్లపై కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వరి పంట దుబ్బు చేసే దశ నుంచి అంకురం దశ వరకు పొలంలో 2 సెంటి మీటర్ల నీరు నిల్వ ఉండాలన్నారు. అంకురం దశ నుంచి పూత దశ వరకు 2 నుంచి 5 సెంటి మీటర్ల వరకు నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల మేరకు ఈ చర్యలు తీసుకోవాలని సూచించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 8 : మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్‌విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, మైనార్టీ నాయకులు గౌస్‌పాషాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

కడ్తాల్ : మత సామరస్యానికి ఇఫ్తారు విందులు ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్స్‌లో వైస్ ఎంపీపీ ఆనంద్ ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో హిందూ, ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొంటూ సోదర భావాన్ని చాటుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. మసీద్‌లో ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాసాలను విరమింపజేశారు. అంతకుముందు కడ్తాల్ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి జైపాల్‌యాదవ్ పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, వీరయ్య, రామకృష్ణ, గంప శ్రీను, రాజేందర్‌యాదవ్, రామచంద్రయ్య, సైదులు, వెంకటేశ్, రాఘవేందర్, గణేశ్, మసీద్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ, జావిద్, ఇమామ్ జహీరుద్దీన్, జహంగీర్‌అలీ, లాయక్ అలీ, ఇర్షాద్, గౌస్, రబ్బానీ, కరీం, యూనుస్ పాల్గొన్నారు.

కడ్తాల్ : ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు, ముస్లింలు

ఇబ్రహీంపట్నం రూరల్ : ఇఫ్తార్ విందులో పాల్గొని మైనార్టీలతో ఉపవాస దీక్ష విరమింపజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

తట్టిఅన్నారంలో ..

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలో కౌన్సిలర్ దేవిడి గీతా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందును ఆరగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, నాయకులు విజయ్‌శేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నిఖిల్, అలీ పాల్గొన్నారు.

షాబాద్ : కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని నాగరగూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. పవిత్ర రంజాన్‌మాసంలో మైనార్టీ సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టడం గొప్ప పరిణామమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కర్నె శ్రీశైలానికి ఘన నివాళి

శ్రీశైలం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 8: పట్టణంలో సోమవారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నె శ్రీశైలం వర్ధంతిని జిల్లా అధ్యక్షుడు జీనికుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో శ్రీశైలం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు శ్రీశైలం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, కల్వకుర్తి ఇన్‌చార్జి కృష్ణ, తలకొండపల్లి మండలాధ్యక్షుడు పవన్, గ్రామాధ్యక్షులు మల్లేశ్, రాజు, దేవేందర్, నర్సింహ, యాదయ్య, మహేశ్, రామలింగం, మురళి, సాయి, వెంకటేశ్, విజయ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం

- కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ, సీఐ నరసింహారావు

కొత్తూరు, ఏప్రిల్ 8: ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిందని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో స్వీప్ 2024 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పెంజర్ల రోడ్డు వరకు బ్యానర్లు, ఫ్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటుపై అవగాహన, ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. ఓట్ ఫర్ ష్యూర్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బాలాజీ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఓటు హక్కుతో బలమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సరసింహారావు, మున్సిపాలిటీ సిబ్బంది. మెస్మా టీమ్ పాల్గొన్నారు.

విస్తరణ పనుల్లో నాణ్యత పాటించాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 8: షాద్‌నగర్ పాత జాతీయ రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రహదారి విస్తరణలో భాగంగా రహదారి మధ్యలో ఉన్న మిషన్‌భగీరథ పైపులైన్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి అయితే షాద్‌నగర్ పట్టణం మరింత అభివృద్ధిని సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణలో భాగంగా రహదారి మధ్యలో ఉన్న మిషన్‌భగీరథ పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

కొత్తూరు, ఏప్రిల్ 8: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో కన్వీనర్ అమడాపురం నర్సింహా గౌడ్ ఆధ్వర్యంలో కొత్తూరు, నందిగామ మండలాలు, కొత్తూరు మున్సిపాలిటీ బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని కొత్తూరులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలను ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటంటే ఒక్క హామీనే నెరవేర్చిందని చెప్పారు. రాహుల్ గాంధీ పీఎం అయితేనే హామీలు నెరవేర్చుతామని కొత్త పల్లవిని అందుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు నాగూర్‌నామోజీ, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, నాయకులు అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, పాపయ్యగౌడ్, మహేందర్, వంశీకృష్ణ, మోహన్‌సింగ్, నాగరాజు, చెన్నయ్య, కృష్ణారెడ్డి, సుధాకర్ అప్ప లష్కర్ నాయక్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 8 : దామరగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి చేయూతనిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన గంగ్యాడ భీమయ్య అతని భార్య కీ.శే. మల్లమ్మ జ్ఞాపకార్థం మల్లన్న ఆలయ నిర్మాణంలో భాగంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు అయ్యే ఖర్చు మొత్తాన్ని భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కురుమ సంఘం గ్రామ అధ్యక్షుడు దొడ్డి రాము, సంఘం ప్రతినిధులు వంక మల్లేశ్, మన్నేగూడెం శ్రీశైలం, గణపురం సత్తయ్య, చిలుకూరి సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో వృద్ధిలోకి రావాలి

బ్యూటిషన్ కిట్లు అందజేస్తున్న అభయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 8 : యువత స్వశక్తితో వృద్ధిలోకి రావాలని లయన్స్‌క్లబ్ లయన్ కేవీ రమేశ్‌రాజు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీ పార్లర్‌ను ప్రారంభించారు. ట్రైనింగ్‌లో పాల్గొన్న మహిళలకు బ్యూటిషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ఆమనగల్లు, ఏప్రిల్ 8: పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్‌లో సోమవారం జేజే హోలిస్టిక్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దంత వైద్య నిపుణురాలు డాక్టర్ స్నేహలతారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దంత సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకుముందు భగవద్గీత విశిష్టత, వ్యక్తిత్వ వికాస నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జగదాంబ పిరమిడ్ వ్యవస్థాపక ధ్యాన గురువు జ్యోతిరెడ్డి, వైద్యుడు భాస్కర్, పాఠశాల నిర్వాహకులు ప్రదీప్‌కుమార్, శివలింగం, వెంకటేశ్, సంజీవ్‌కుమార్, శైలజ, శశికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కాంగ్రెస్‌ను నిలదీయాలి

- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొయినాబాద్, ఏప్రిల్ 8 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నదని, ఆ పార్టీని ప్రజలు నిలదీయాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలోని జేపీఎల్ కన్వెన్షన్ హాల్‌లో చేవెళ్ల పార్లమెంట్ బూత్ అధ్యక్షుల సమ్మేళనం జరిగిది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నాటి కాంగ్రెస్ పాలనలో అనేక కుంభకోణాలు జరిగాయన్నారు. ప్రధాని మోదీ రామ మందిరాన్ని నిర్మించి, ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీని ఆహ్వానిస్తే రాలేదని గుర్తు చేశారు. వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇప్పటికే రూ.100 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి గుడి భూములను మింగి అపార్ట్‌మెంటును నిర్మిస్తున్నారని, అలాంటి వ్యక్తులకు ఓటు వేస్తే చేవెళ్ల నియోజకవర్గంలోని దేవాలయాల భూములను కూడా మింగేస్తారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందె శ్రీరాములు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర నాయకులు ప్రేమ్‌రాజ్‌యాదవ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

సాగర్ ప్రధాన రహదారిపై పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

తుర్కయాంజాల్, ఏప్రిల్ 8 : వేసవిలో పారిశుధ్య విధులు నిర్వహించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్‌లో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని కమిషనర్ సత్యనారాయణరెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు బయట చెత్తను వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధన్‌రాజ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

యాచారం : ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి కూలీలు

యాచారం, ఏప్రిల్ 8: ఉపాధిహామీ కూలీలకు మూడు నెలలుగా చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల అభివృద్ధి అధికారి నరేందర్‌రెడ్డికి సోమవారం ఉపాధి కూలీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మూడు నెలలుగా బిల్లులు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రతి రోజూ రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేవారు. ఉపాధి కూలీల పట్ల మోదీ ప్రభుత్వం వివక్షత చూపుతున్నదని మండిపడ్డారు. కూలీలకు గడ్డపార, పార, తట్ట పనిముట్లను ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అరుణ, పుష్ప, జంగయ్య, రాములు, ఇంద్రమ్మ, యాదయ్య తదితరులున్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్ రూరల్ : ఉపాధిహామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనూనాయక్ అన్నారు. సోమవారం ఎంపీడీవో వినయ్‌కుమార్, ఏపీవో అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల డబ్బులను చెల్లించాలని, వేసవి దృష్ట్యా అన్ని వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో రాజు, ఎల్లమ్మ, లింగమ్మ, పవన్ తదితరులు పాల్గొన్నారు.